క్లుప్తంగా

రూ.8.63 లక్షల పరికరాల అందజేత



పరికరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు బర్జర్ పెయింట్స్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా రూ.8.63 లక్షల విలువైన ప్రయోగ పరికరాలను అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ హరీష్‌బాబు తెలిపారు. సోమవారం కళాశాల ఈసీఈ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల్లో మైక్రోవేవ్‌బెంచ్, హైడ్రాలిక్ ల్యాబ్‌లో పరికరాలను బర్జర్ పెయింట్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ వెంకట అప్పారావు, ఫైనాన్స్ హెడ్ వినయ్ కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ దేవరాజు ప్రారంభించారు. విద్యార్థులు పరికారాలను సరైన రీతిలో ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ హెచ్‌ఓడీ టీ.శ్రీనివాసులు, సివిల్ ఇంజనీరింగ్ హెచ్‌ఓడీ వీబీఆర్ శర్మ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అశ్వర్థనారాయణ రెడ్డి (ఫైల్)

పరిగి: మండలంలోని ధనాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ అశ్వర్థనారాయణరెడ్డి (54) మృతి చెందాడు. ఏఎస్ఐ జయలత వివరాలమేరకు... మండలంలోని బోరెడ్డిపల్లికి చెందిన అశ్వర్థనారాయణరెడ్డి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య అరుణమ్మతో పాటూ కుమార్తె హర్షిత, కుమారుడు సాయిచరణ్ ఉన్నారు.ఆదివారం రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై హొన్నంపల్లి వైపు తన మిత్రుడు ఎరుకల వెంకటేష్‌తో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పరిగి చెరువు కట్ట కింద ఉన్న ఓ తూము సమీపంలో మడకశిర వైపుగా వెళ్తున్న ఓ కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. అశ్వర్థనారాయణరెడ్డి, ఎరుకల వెంకటేష్ తీవ్రంగా గాయపడగా హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అశ్వర్థనారాయణరెడ్డి సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎరుకల వెంకటేష్ కాళ్లు విరగడంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అరుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయండి

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే కమాండ్ కంట్రోల్ రూం 9059417612కు తెలియజేయాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తామన్నారు.

చదువుతో ఉన్నత శిఖరాలు



రిబ్బన్ కట్ చేసి ఎల్‌ఈడీ టీవీని ప్రారంభిస్తున్న ఆర్‌ఎం వెంకటేశ్వర్లు

పెనుకొండ: చదువు ద్వారా సులువుగా ఉన్నత శిఖరాలకు చేరవచ్చని స్థానిక స్టేట్ బ్యాంక్ రీజియనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని 3వ అంగన్‌వాడీ సెంటర్‌కు సోమవారం స్టేట్‌బ్యాంక్ తరపున ఎల్‌ఈడీ టీవీ, ఫిల్టర్, ఓవర్‌హెడ్ ట్యాంక్, రన్నింగ్ వాటర్, పెయింటింగ్ తదతర వాటిని అందించారు. మేనేజర్ రామయ్య, సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్లు సుజత, పుష్పలత, రాజేశ్వరి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతి

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామానికి చెందిన వీఆర్‌ఏ హనుమంతప్ప (62) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అంజనాదేవి గ్రామానికి చేరుకొని హనుమంతప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. సర్పంచ్ సోమశేఖర్, మాజీ సర్పంచ్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ జాతర



అలంకరణలో బోదుల మారెమ్మ

పావగడ: పట్టణ సమీపంలోని తుమకూరు రోడ్డు వద్ద బయలు ప్రాంతంలో వెలసిన బోదుల మారెమ్మ జాతరోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కర్ణాటక నుంచే కాకుండా చుట్టు పక్కల ఉన్న ఏపీ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పరీక్షలు



అమరాపురంలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



రొద్దంలో పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులు



హిందూపురం: పరీక్ష కేంద్రంలో కూర్చొని ఉన్న విద్యార్థులు

హిందూపురం టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం తెలుగు పరీక్ష నిర్వహించారు. హిందూపురం మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా 15 సెంటర్లు ఏర్పాటు చేశారు. 3,217 మంది విద్యార్థులకుగాను 3063 మంది హాజరవ్వగా 154 మంది గైర్హాజరయ్యారు.

గోరంట్ల: మండలంలోని ఏర్పాటు చేసిన ఆరు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షను నిర్వహించారు. 1,116 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సిండగా 1070 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 46 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి గోపాల్ తెలిపారు. గోరంట్ల పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ అక్బల్‌బాషా పరిశీలించారు.

అగళి: స్థానిక కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో మొదటి రోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఏ సెంటర్‌లో 184 మంది విద్యార్థులు పరీక్షలను రాయల్సి ఉండగా 171 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. బీ సెంటర్‌లో 151 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 146 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా 797 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయాల్సి ఉండగా 737 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓలు నాగరాజు, కుల్లాయప్ప తెలిపారు. 60 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. ఏపీ గురుకుల పాఠశాల ఏ కేంద్రంలో 15 మంది, బీ కేంద్రంలో 19 మంది, ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 15 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో11 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు.

చిలమత్తూరు: మండలంలోని ఎస్ఎస్‌వైపీఎస్ ప్రైవేటు పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు పరీక్షల విభాగం చీఫ్ సూపరింటెండెంట్‌లు ఈశ్వర ప్రసాద్, రవిశంకర్ తెలిపారు. మొత్తం 504 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 486 మంది హాజరైనట్లు చెప్పారు. 18 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

అమరాపురం: మండలంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మూడు కేంద్రాల్లో 635 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 10 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు ఎంఈఓ రాఘవయ్య తెలిపారు. 625 మంది పరీక్ష రాశారన్నారు. సీఎస్‌లు, డీఓలు ప్రభాకరరెడ్డి, గోవిందప్ప, నరేంద్ర, నాగరాజు, చంద్రమౌళి, ఉమేష్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో సోమవారం నిర్వహించిన పదోతరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించారు. ఏ, బీ, సీ సెంటర్లలో 680 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

రొళ్ల: మండల కేంద్రంలో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జెడ్పీహెచ్‌ఎస్ సెంటర్–1లో 213 మందికి గాను 206 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. ఆవినకుంట కేజీబీవీ సెంటర్–2లో 209 మందికిగాను 196 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. సెంటర్–1లో చీఫ్ సూపరింటెండెంట్‌గా సునీత, సెంటర్–2లో చీఫ్ సూపరింటెండెంట్‌గా తిమ్మప్ప వ్యవహరించారు.

పరిగి: మండలంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించారు. పరిగి, సేవామందిరం జెడ్పీ స్కూల్‌లతో పాటూ ఏపీఆర్‌ఎస్, అమర్ విద్యామందిరంలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 749 మంది విద్యార్థులకుగాను 22 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ–2 శేషాచలం తెలిపారు.

నేడు గోరంట్లలో మంత్రి పర్యటన

గోరంట్ల: రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ మంగళవారం గోరంట్లకు విచ్చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని రంగమహల్ ఫంక్షన్ హాల్‌లో దళిత సోదరుల ఆత్మీయ సభ మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి ఉషశ్రీచరణ్ హాజరవుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్

పరిగి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పరిగి మండల పర్యటనకు వచ్చారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రాజేశ్వరీ, ఎంపీడీఓ సుహాసినమ్మతో ఎన్నికల నిర్వహణ, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. గ్రామాల్లో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను తొలిగించి నిబంధనలు పాటించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేయించడానికి అవసరమైన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీనరసింహా, ఆర్‌ఐ సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ మెజార్టీతో గెలవడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



హాజరైన వైఎస్సార్‌సీపీబూత్ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, ముఖ్య నాయకులు

- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: అఖండ మెజార్టీతో గెలవడమే లక్ష్యమని మంత్రి , వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ అన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ గృహ సారథులు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరూ 85 సంవత్సరాలుదాటిన వృద్ధులు, దివ్యాంగులు వారి ఇళ్ల నుంచే ఓటు వేసే విధంగా ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు చేసుకునే సంతకాలు తీసుకోవాలన్నారు. 2 రోజుల్లోగా సంతకాల పని పూర్తిచేసి ఆయా మండల నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులకు అప్పగించాలన్నారు.

నాడు మోదీ నెత్తిపైన .. నేడు మోదీ కాళ్ల కింద..

చంద్రబాబు జిమ్మిక్కు రాజకీయాలు చూసి దేశమే నివ్వెపోతోందని మంత్రి ఉషశ్రీచరణ్ విమర్శించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంతో దేశ ప్రధాని మోదీని తీవ్రవాది, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, దేశం నుంచి తరమికొట్టాలి, తల్లిని, భార్యను చూసుకోని వాడు మనకు అవసరమా అని దుర్భాషలాడి నేడు కేసుల నుంచి బయటపడడానికి మోదీ కాళ్ల కింద కూర్చున్నాడన్నారు. తాను ఓడిపోతే వివిధ కేసుల్లో జైలుకెళ్లాల్సి వస్తుందని, ఢిల్లీలో పడిగాపులు కాసి మోదీని ప్రాధేయపడి పొత్తు కుదుర్చుకున్నాడన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారం చేపడితే ముస్లింలను తీవ్ర ఇబ్బందులపాలు చేస్తారన్నారు. పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితమ్మ తమకు సంబంధించిన బ్యానర్లకు నిప్పు పెట్టించడం, బ్లేడ్లతో కోయించడం పరిపాటిగా మార్చుకుందన్నారు.

అవాస్తవాలను నమ్మొద్దు

తాను గెలిస్తే ఎవరినీ పెద్దగా పట్టించుకోనని కొందరు తనపై లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. అవన్నీ అవాస్తవాలేనని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. మాటల్లో చెప్పడం కాదు చేతల్లో చేసి చూపిస్తానని చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, తాను సాయం చేయకుంటే ఆ క్షణమే తనపై నమ్మకం ఉంచొద్దన్నారు. సమావేశంలో కన్వీనర్లు బోయ నరసింహ, నారాయణరెడ్డి, తిమ్మయ్య, నరశింహమూర్తి, ధనుంజయరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారుక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్‌లు సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, తయూబ్, సద్దాం, ఎంపీపీ గీత, ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి, జయశంకరరెడ్డి, వేణు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పెనుకొండ: పట్టణంలోని కుమ్మరదొడ్డి 3, 4, 5వ వార్డుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సద్దాం నేతృత్వంలో సోమవారం ఉదయం మంత్రి ఉషశ్రీచరణ్‌ను కలసి షేక్షా, సాధిక్‌వలి, సుభాన్, బాబాజాన్ తదితరులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.

సోమందేపల్లిలో...

సోమందేపల్లి: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన 30 కుటుంబాలు సోమవారం మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి, వైస్ సర్పంచ్ వేణు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే ఉన్నాం

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లిలో శనివారం టీడీపీ అభ్యర్థి సవితమ్మ తమకు బలవంతంగా పార్టీలో కండువాలు వేసినట్లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కిరణ్, పవన్, సందీప్, నాగేష్, శ్రీరాములు, హరికృష్ణలు తెలిపారు. పెనుకొండలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ సమక్షంలో వాళ్లు తిరిగి పార్టీలో చేరారు.



పెనుకొండ: వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ముస్లింలు





సోమందేపల్లికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

మడకశిరను మరింత అభివృద్ధి చేస్తాం



మడకశిర మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మను కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిరరూరల్: రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. సోమవారం చెందకచెర్ల, హెచ్‌ఆర్ పాళ్యం, భక్తరపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎంపీపీ కవిత, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మమేకమయ్యారు. అలాగే మడకశిర పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మైనార్టీ నాయకుడు అక్రమ్, కౌన్సిలర్లను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా పార్టీలకు అతీతంగా చేసిన లబ్ధిని ఈరలక్కప్ప ప్రజలకు వివరించారు. అదే విధంగా గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడాను గమనించాలన్నారు. టీడీపీ హయాంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలను ఎవరూ నమ్మి మోసపోవద్దన్నారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టంకడితే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కరించడంతో పాటు మడకశిర ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే హరేసముద్రం పంచాయతీ నాయకులు, కార్యకర్తలు భక్తరపల్లిలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, కోఆప్షన్ సభ్యులు ప్రకాష్, మండల పీఎంపీ కన్వీనర్ మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, వివిధ కమిటీల సభ్యులు తిమ్మప్ప, బాలకృష్ణారెడ్డి, శేఖర్, మనోహరెడ్డి, సుధాకర్, దొడ్డయ్య, దివాకర్, చిరంజీవి, నారాయణస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయండి

గుడిబండ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. 'మేము సిద్ధం – మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా కొంకల్లు గ్రామంలో ఆయన సోమవారం నాయకులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ , బీసీ సెల్ అధ్యక్షుడు పాండు, సర్పంచ్ అశ్వత్, నాయకులు నిరంజన్‌స్వామి, లోకేష, లింగరాజు, హరీష్, నయాజ్, కార్యకర్తులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

గుడిబండ: 'మేము సిద్ధం– మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కొంకల్లు గ్రామంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు మూర్తప్ప, లింగరాజు, మంజునాథ్, రామణ్ణ, నటరాజు, రాజు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఈరలక్కప్ప కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి నచ్చే తాము వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు పార్టీ తీర్థం పుచ్చుకున్నవారు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్వత్, బీసీ సెల్ అధ్యక్షుడు పాండు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండల పరిధిలోని చందకచర్ల పంచాయతీకి చెందిన శేషాద్రి గౌడ్, రంగనాయక్ జయరామ్ నాయక్, హరి వారి అనుచరులతో టీడీపీని వీడి సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల క్రితం టీడీపీలోకి చేరి తప్పుచేశామన్నారు. తప్పును తెలుసుకొని మళ్లీ వైఎస్సార్‌సీపీలో చేరామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు హనుమంతరెడ్డి, నాయకులు రమేష్ నాయక్ జగన్నాథ్ బుడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.



మడకశిర: ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- ప్రచార రథాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక



ప్రచార రథానికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక

హిందూపురం: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎన్ దీపిక తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయం వద్ద ప్రచార రథానికి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ పేదలకు జరుగుతున్న మంచిని అడ్డుకునేందుకే టీడీపీ, జనసే, బీజేపీలు జతకట్టాయన్నారు. జగనన్న ఆధ్వర్యంలో పెత్తందారులపై పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. హిందూపురం నుంచి టీడీపీని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. హిందూపురం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా బోయ శాంతమ్మలను పార్టీ ఎంపిక చేసిందన్నారు. ప్రజలందరూ తమను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



నూతన సచివాలయం వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా సోమవారం జీవీ పాళ్యం గ్రామంలో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయం, పాఠశాల ఆవరణాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలన్నారు. మొక్కలు పెంపకం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు మౌనిక, పీఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్‌కు పోటా పోటీ

పావగడ: ఎన్నికల నేపథ్యంలో చిత్రదుర్గం ఎంపీ టికెట్‌కు పోటా పోటీ నెలకొంది. కాంగ్రెస్ తరపున టికెట్‌ను ఆశిస్తున్న మాజీ ఎంపీ బీఎన్ చంద్రప్ప అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. అలాగే స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప కుమారుడు హెచ్‌వీ కుమారస్వామి సైతం టికెట్ కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే వినయ్ తిమ్మాపూర్, నేరళగుంటి రామప్ప, జేజే హట్టి తిప్పేస్వామి తమ దైనశైలిలో టికెట్ కోసం పావులు కదుపుతున్నారు. అయితే మాజీ ఎంపీ చంద్రప్పకే టికెట్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే బీజేపీ, జేడీఎస్ కూటమి తరపున ప్రస్తుత ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి నారాయణ స్వామి, మాజీ ఎంపీ జనార్ధనస్వామి, మాదార చెన్నయ్యస్వామి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నారాయణస్వామి, జనార్ధనస్వామి మధ్యే గట్టి పోటీ ఉందని అంటున్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక (17) ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఓ యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడటంతో మనస్తాపానికి గురై ఇంటి వద్ద విషం సేవించింది. తల్లిదండ్రులు గమనించి చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలు మార్చండి

అమరాపురం: స్థానిక శిర రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో మిద్దెపై ప్రమాదకరంగా వెళ్లిన 11 కేవీ విద్యుత్ తీగలను పక్కకు మార్చాలని ఆ కాలనీ వాసులు సోమవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ సిద్దేశ్వరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్న, మంజునాథ, రామలింగప్ప తదితరులు మాట్లాడుతూ కాలనీలో 12 కుటుంబాలకు చెందిన మిద్దెల పైన తీగ వెళ్తోందని, ఇంటి దగ్గర చిన్న పిల్లలు ఉంటారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొందన్నారు.